పార్కు ఉన్నా..ప్రయోజనం లేదాయె!

- నిర్వహణ లేక వెలవెల
- పాడై పోతున్న ఆట పరికరాలు
- ప్రభాత్‌నగర్‌లోని చిల్డ్రన్ పార్కు దుస్థితి ఇదీ



నిరుపయోగంగా మారిన ప్రభాత్‌నగర్ పార్కు, పిల్లల ఆటపరికరాలు

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కొన్ని చోట్ల పార్కులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, చైతన్యపురి డివిజన్‌లో మాత్రం నిర్వహణ లోపంతో ఉన్న పార్కులు నిరుపయోగంగా మారుతున్నాయి. డివిజన్‌లోని ప్రభాత్‌నగర్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కే ఇందుకు ఉదాహరణ.

- ఈ పార్కులో పెద్దల కోసం వాకింగ్ ట్రాక్, పిల్లల కోసం ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. కానీ ఇటీవల కొంత కాలంగా ఈ పార్కుకు తాళం వేసి ఉండటం, నిర్వహణ లేకపోవటంతో వెలవెల పోతోంది.
- దీంతో సాయంత్రం వేళల్లో మందుబాబులు పార్కు పరిసరాల్లో మద్యం తాగి, పార్కు ఫుట్‌పాత్‌పై బీరు సీసాలు పడేసిపోతున్నారని స్థానికులు చెప్తున్నారు.
- ఆరు నెలల క్రితం వరకు పిల్లలు సాయంత్రం వేళల్లో ఈ పార్కులో ఆడుకునే వారని, ఇప్పుడు తాళం కూడా తీయటం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- పార్కులో పడిపోయిన చెట్లను తొలగించటం లేదని, నీరు పోయకపోవటంతో పూల మొక్కలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల ఆట పరికరాలు తుప్పుపట్టే పరిస్థితి నెలకొందంటున్నారు.
- ఇప్పటికైనా పార్కును తిరిగి ప్రారంభించి, సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పార్కు అభివృద్ధికి చర్యలు



కొంత కాలంగా ప్రభాత్‌నగర్‌లోని చిల్డ్రన్ పార్కు నిరుపయోగంగా మారిన విషయం వాస్తవమే. పార్కు నిర్వహణను జీహెచ్‌ఎంసీ పట్టించుకోవడం లేదు. ఇంతకు ముందు కూడా అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పార్కు ప్రహరీ పక్కనే టిమ్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, ఈ క్రమంలో ప్రహరీ కూలిపోయి చెట్లు విరిగిపోయాయి. త్వరలో పార్కును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి అందరికీ ఉపయోగపడేలా చూస్తాం.

–రంగా నర్సింహగుప్తా, కార్పొరేటర్, చైతన్యపురి డివిజన్

అంతర్గత రోడ్లను అందంగా తీర్చిదిద్దుతాం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లను అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్ గాంధీనగర్‌లో రూ.14 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి కృషి చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తామని, అవసరమైన ప్రాంతాలలో కొత్త పనులు చేపడతామన్నారు. జీహెచ్‌ఎంసీ ఎస్‌ఎఫ్‌ఏ శ్రీనివాస్, నాయకులు ప్రవీణ్‌యాదవ్, దినేష్, మల్లేష్, శ్రీను, ఉమేష్ పాల్గొన్నారు.

మలక్‌పేటకు 4వేల క్రిస్మస్ కానుకలు



మాట్లాడుతున్న నోడల్ అధికారి యుగంధర్‌రెడ్డి

చాదర్‌ఘాట్: క్రిస్మస్ పర్వదిం సందర్భంగా ప్రతి సంవత్సరంలానే ఈసారి కూడా పేద క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేస్తామని మలక్‌పేట నియోజకవర్గం నోడల్ అధికారి యుగంధర్‌రెడ్డి తెలిపారు. గురువారం నియోజకవర్గంలోని పలు చర్చిల పాస్టర్లు, నిర్వాహకుల నుంచి అర్హుల జాబితాను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో మొత్తం నాలుగు వేల కానుకలు పంపిణీ చేస్తామన్నారు. ఒక్కో చర్చికి 500 కానుకలు కేటాయిస్తామన్నారు. ప్రతి డివిజన్‌లో రెండుచోట్ల ఈ పంపిణీ చేసేలా పాస్టర్లు చూసుకోవాలన్నారు. క్రిస్మస్ విందు కోసం ఒక్కో చర్చికి రూ. లక్ష కేటాయిస్తామన్నారు. పంపిణీ కార్యక్రమాల కోసం నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల 8 మందితో కమిటీలు వేశామన్నారు. గతంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలు ఈసారి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతున్నాయన్నారు.

కొత్తపేటలో అడ్వాన్స్‌డ్ గ్రో హెయిర్ క్లినిక్ ప్రారంభం



అడ్వాన్స్‌డ్ గ్రో హెయిర్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ శరణ్

దిల్‌సుఖ్‌నగర్: కొత్తపేటలోని బహేటి స్పెక్ట్రంలో గల వెస్ట్ సైడ్ పై అంతస్తులో నూతనంగా ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ గ్రో హెయిర్– గ్లో స్కిన్ క్లినిక్‌ను ఆర్‌కేపురం డివిజన్ కార్పొరేటర్ రాధా ధీరజ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా అడ్వాన్స్‌డ్ గ్రోహైర్ క్లినిక్ మేనేజింగ్ డైరెక్టర్ శరణ్ మాట్లాడుతూ, అందం ఆత్మవిశ్వాన్ని మరింత పెంచుతుందన్నారు. మారుతున్న అలవాట్లు, జీవనశైలి కారణంగా ప్రతి ఒక్కరిలో జుత్తు రాలడం సమస్య పెరిగిందన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం చైన్నై ఆధారిత గ్రో హెయిర్ సంస్థ అత్యాధునిక చికిత్సలు ఇక్కడ కూడా అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. హెయిర్ గ్రోత్ చికిత్సలతో పాటు మైక్రో బ్లేడింగ్, లిప్ మైక్రోపిగ్మెంటేషన్, ఐలాష్ లిఫ్ట్ –ఎక్స్‌టెన్షన్, లేజర్ థెరపీలు వంటి కొన్ని ప్రీమియం సౌందర్య చికిత్సలను కూడా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫ్రాంచైజీ భాగస్వాములు సీవీఎన్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, హరిణ్య గౌని, శ్రీధర్ పురుషోత్తం పాల్గొన్నారు.

మూడు వేర్వేరు కేసుల్లో ఐదుగురికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: ఒకే రోజు మూడు వేర్వేరు కేసుల్లో ఐదుగురు నిందితులకు జీవిత ఖైదు విధిస్తూ 9వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి హరీశ సంచలన తీర్పులు వెలువరించారు. కోర్టు ఎపీపీ రఘు తెలిపిన కథనం మేరకు వివరాలివి..కొత్తూరు పోలీసు స్టేషన్లలో నమోదైన హత్య కేసులో నిందితుడైన సభావత్ లక్ష్మణ్ (32)కు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 10వేల జరిమానా విధించారు. నందిగామ పోలీసు స్టేషన్‌లో నమోదైన హత్య కేసులో నిందితులైన అచ్చిగారి ప్రవీణ్(25), అచ్చిగారి జంగయ్య(55)లకు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 10వేల జరిమాన, కడ్తాల్ పోలీసు స్టేషన్లలో నమోదైన హత్య కేసులలో నిందితులైన జటావత్ కిషన్(36), జటావత్ విజయ(33)లకు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి హరీశ తీర్పునిచ్చారు.

పీవీ రావుకు ఘన నివాళి



పీవీ రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

మన్సూరాబాద్: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు వర్ధంతిని శుక్రవారం ఎల్‌బీనగర్‌లో నిర్వహించారు. మాల మహానాడు ఎల్‌బీనగర్ అధ్యక్షుడు చింతపల్లి కాశీనాథ్ పీవీ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, మాల జాతి అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటం చేసి ప్రాణత్యాగం చేసిన మహానీయుడు పీవీ రావు అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అనిమల్ల యాదగిరి, గోలి వెంకన్న, ప్రచార కార్యదర్శి తీగల మహేశ్, తీగల దశరథ, ఎడ్ల శ్రీధర్‌బాబు, శ్రీకాంత్, మహేశ్, జగన్మోహన్, గణపతి పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబర్చాలి



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నాగోలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తిని కనబర్చాలని అవినాష్ కాలేజీ ఆఫ్ కామర్స్ గ్రూప్ సంస్థల అధినేత, చైర్మన్ డాక్టర్ అవినాష్ బ్రహ్మదేవర అన్నారు. అవినాష్ కాలేజీ ఆఫ్ కామర్స్ ఎల్‌బీనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు శుక్రవారం సరూర్‌నగర్ స్పోర్ట్స్ స్టేడియంలో స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన డాక్టర్ అవినాష్ బ్రహ్మదేవర మాట్లాడుతూ, క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో అవినాష్ కాలేజీ డైరెక్టర్లు, డీన్ సుశీల, ఎల్‌బీనగర్ ఇంటర్మీడియట్ బ్రాంచ్ ప్రిన్సిపాల్ నీరజ లోకసాని, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత ఎమ్మెల్యేకు అక్బరుద్దీన్ ఒవైసీ క్షమాపణ చెప్పాలి

- టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్



మలక్‌పేట: అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యేను అవమానించిన మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ వెంటనే అతనికి క్షమాపణ చెప్పాలని టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మూసారంబాగ్ ఆయన మాట్లాడుతూ..దళిత ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను మొదటి సారి గెలిచిన బచ్చా అని అక్బరుద్దీన్ సంబోధించడాన్ని ఆయన ఖండించారు. బీఆర్‌ఎస్ పార్టీకి వత్తాసు పలుకుతూ అహంకార పూరితంగా ఉన్నత విద్యావంతుడైన దళిత ఎమ్మెల్యేను ఉద్దేశించి అక్బరుద్దీన్ చేసిన వ్యాఖ్యలు శోచనీయమన్నారు. ఉత్తర ప్రదేశ్, బీహార్, మహారాష్ట్రల్లో బీజేపీ గెలుపు కోసం పరోక్షంగా పని చేసి.. కేంద్రంలో బీజేపీకి, తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు మద్దతు పలుకుతున్న మజ్లిస్ పార్టీ విధానాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

భార్యను కడతేర్చిన భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష

రంగారెడ్డి కోర్టులు: భార్యపై అనుమానంతో కర్రతో కొట్టి చంపిన భర్తకు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధించారు రంగారెడ్డి జిల్లా 3వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి రత్న పద్మావతి. ఏపీపీ రఘు తెలిపిన వివరాల ప్రకారం... నిందితుడు వి.రవికి 2001లో బుజ్జితో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారడంతో బుజ్జి టైలరింగ్, గాజుల దుకాణం నిర్వహించేది. మద్యానికి బానిసైన భర్త రవి ఆమెపై అనుమానంతో తరుచూ శారీరకంగా హింసిచేవాడు. ఈ క్రమంలో పెద్దలు మందలించడంతో అతను కొన్నాళ్లు బుద్ధిగానే ఉన్నాడు. ఆ తర్వాత ఒక రోజు రవి తాగి ఇంటికి వచ్చి భార్యను కర్రతో విచక్షణా రహితంగా కొట్టి తీవ్రంగా గాయపర్చాడు. బాధితురాలిని ఆస్పత్రిలో చేర్పించగా చికిత్సలో పొందుతూ మృతి చెందింది. ఈ విషయంపై మృతురాలి సోదరుడు మహేశ్వరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు నిందితుడు రవి(39)కి శుక్రవారం యావజ్జీవ కఠిన కారాగార శిక్ష తోపాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



మేయర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు యుద్ధ ప్రాతిపదికన నిధులను మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మేయర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, మన్సూరాబాద్ పెద్దచెరువు ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్, యోగా షెడ్, ఎల్‌ఈడీ లైటింగ్‌ను ఏర్పాటు చేశామని, ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తే ఆరోగ్యరీత్యా ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సూర్యోదయకాలనీ ఫ్రెండ్స్ కేఫ్ రోడ్డు, ప్రగతినగర్ 40 ఫీట్ల రోడ్డును మోడర్న్ రోడ్డుగా లైటింగ్‌తో అభివృద్ధి చేయాలన్నారు. సహారాస్టేట్స్‌కాలనీలో ఇంటర్నల్ బీటీ రోడ్డును పునరుద్ధరించాలన్నారు. వీరన్నగుట్ట, సెంట్రల్‌బ్యాంక్ కాలనీలో అంతర్గత సీసీ రోడ్లను నిర్మించాలని, ఎన్నిక కోడ్ నేపథ్యంలో అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగిందని, నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని మేయర్‌ను కోరానని కార్పొరేటర్ తెలిపారు.

వైకుంఠ శోభ



వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాలు శోభాయమానంగా వెలుగులీనుతున్నాయి. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకొని నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఇలా పహాడీషరీఫ్ పరిధిలోని మామిడిపల్లి శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించిన దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది. - పహాడీషరీఫ్

నేడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి చింతలకుంట జనప్రియ హోమ్స్‌లోని గోదా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ (ముక్కోటి) ఏకాదశి సందర్భంగా శనివారం ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ ఫౌండర్, చైర్మన్ పీవీ నర్సింహారావు తెలిపారు. అలాగే ధనుర్మాస విశేష కార్యక్రమాలలో భాగంగా జనవరి 8న మరిమళై సింహాసనోత్సవం, 12న కూడారై పాశురం, పాయస నివేదన, 14న గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 45, బెండ 55, పచ్చిమిర్చి 40, కాకర 58, బీర 55, క్యాబేజీ 16, ఫ్రెంచిబీన్స్ 45, క్యారెట్ 37, దొండ 60, చిక్కుడు 25–75, గోకర 50, బీట్‌రూట్ 28, క్యాప్సికం 65, ఆలు 23, దోస 28, సొర 17, పొట్ల 13, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 47. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అన్నదానం ఎంతో గొప్పది

నాగోలు: అన్ని దానాల కన్నా అన్నదానం ఎంతో గొప్పదని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. బీజేపీ నాయకుడు మొగుళ్లపల్లి ఉపేందర్ గుప్తా ఆధ్వర్యంలో కొత్తపేట మారుతీనగర్ ఆంజనేయ ఆలయంలో శుక్రవారం అయ్యప్ప స్వాములకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో శ్రీనివాస్‌గుప్తా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్ గుప్తా, వెంకన్న నారాయణ, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ యోగా పరిశోధన పుస్తకావిష్కరణ

కాచిగూడ: ఓయూ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ రచనలో వెలువడిన 'శాస్త్రీయ యోగా పరిశోధన దృక్పథం కోణాల నుంచి మన సంపూర్ణ ఆరోగ్యం పెంపొందిస్తుంది' పుస్తకాన్ని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ లక్ష్మీకాంత్ రాథోడ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.లక్ష్మయ్య, పుస్తక రచయిత ప్రొఫెసర్ రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: ప్రపంచ ప్రఖ్యాత గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం చంపాపేటలోని పలు పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కర్మన్‌ఘాట్ శ్రీ సరస్వతి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విద్యావేత్త లెక్కల కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై రామానుజన్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ..భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహా గణిత శాస్త్రవేత్త రామానుజన్ అని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు గణిత సంబంధిత ప్రదర్శనలు ఆహూతులను ఆలోచింప చేశాయి. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లలితారెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి, బీనా, అమీనా, అనిత పాల్గొన్నారు.

చంపాపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో..

చంపాపేట ప్రాథమిక పాఠశాలలో ప్రీతమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి హాజరై విద్యార్థులు ఏర్పాటు చేసిన గణిత శాస్త్ర ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మల్లేశ్వరి, లక్ష్మి, వెంకటదేవి, రజిత, ఏఎంఓ జయచంద్రారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం అనంతరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు రామానుజన్ ప్రేరణ

సైదాబాద్: చిన్నతనంలోనే గణిత శాస్త్రంలో అపార పరిశోధనలు చేసిన గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ విద్యార్థులకు ఎప్పటికీ ప్రేరణగా నిలుస్తారని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ కె.గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా చంపాపేటలోని పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు 180కి పైగా గణితశాస్త్ర నమూనాలను చార్టులు, మోడల్స్ రూపంలో చేసిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ శారద, వైస్ ప్రిన్సిపాల్ సిద్ధిరాం, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శ్రీసరస్వతి ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ప్రదర్శనను పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి



గణిత ప్రదర్శనను తిలకిస్తున్న కరస్పాండెంట్

జీఎస్ఐ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వినతి

మన్సూరాబాద్: జీఎస్ఐలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆలిండియా జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కేంద్ర గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతరావును కోరారు. శుక్రవారం జీఎస్ఐకి విచ్చేసిన ఆయనను ఎంప్లాయీస్ అసోసియేషన్ చైర్మన్ ఆదర్ల మహేష్, రీజినల్ కార్యదర్శి మధిర సత్యనారాయణ కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, జీఎస్ఐలో అనేక సమస్యలున్నాయని, ముఖ్యంగా కేడర్ రివ్యూ చేయాలని, సర్వే యూనిట్‌లో ఉద్యోగాలను భర్తీ చేయాలని, స్టోర్స్ స్ట్రీమ్‌లో పదోన్నతులు కల్పించాలని కోరినట్టు తెలిపారు. కార్యక్రమంలో జీఎస్ఐ డీజీ జనార్దన్ ప్రసాద్, ఏడీజీ సీహెచ్. వెంకటేశ్వర్ రావు, డీడీజీ అజయ్‌కుమార్, ఎంఎల్ దొర, అసోసియేషన్ నేతలు ఆనంద్‌కుమార్, శివశంకర్, మల్లేష్, మాథ్యూ, చంద్రయ్య, అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు



మోహన్‌నగర్‌లోని సెయింట్ మాథ్యూస్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ ప్రేమ్‌కుమార్ దేవానంద్

నాగోలు: క్రీస్తు బోధనలు ప్రపంచమానవాళికి ఆరాధ్యనీయని డాక్టర్ రెవరెండ్ ప్రేమ్‌కుమార్ అన్నారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని సెయింట్ మాథ్యూస్ ఫుల్ గోస్పెల్ మినిస్ట్రీస్ చర్చిలో చర్చి ఫౌండర్ చైర్మన్ ఎం.దేవానంద్– రాజశ్రీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ, ఏసు ప్రభువు జీవితం త్యాగానికి చిన్నాం అన్నారు. లోకరక్షుడైన క్రీస్తును ఆరాధించాలని, ఏసు ప్రభువు ఆరాధనతో అంతా మంచి జరుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీస్తును కొలుస్తూ ప్రత్యేక ప్రార్థనలు, భక్తి గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ సందేశం అందజేశారు. కార్యక్రమంలో సెయింట్ మాథ్యూస్ ఫుల్ గోస్పెల్ మినిస్ట్రీస్ చర్చి సంఘం ఉపాధ్యక్షుడు ప్రసాద్ ప్రసన్న, ప్రధాన కార్యదర్శి సువర్ణ ప్రసాద్– కవిత, అనిల్‌కుమార్–పల్లవి, ప్రసాద్‌కుమార్, మోహన్‌గ్రేస్, రాహేలమ్మ, జయలక్ష్మి, ప్రసన్నపాల్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ శుభం కలగాలి

హయత్‌నగర్: క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, ఈ పండుగ అందరికీ శుభం కలగజేయాలని జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ కమలాసుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హయత్‌నగర్ డివిజన్‌లోని ఎలిమ్ ప్రేయర్ హౌస్ ఆధ్వర్యంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె పాల్గొని కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ప్రపంచ శాంతిని కాంక్షించే యేసు ప్రభువు దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉంటాయన్నారు. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, చంద్రశేఖర్, ఏలియా, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న కమలాసుధీర్‌రెడ్డి